ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 26 జూన్ 2024



చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తాండూరు, జూన్ 25 : చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జ్ఞాన విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ చైర్మన్ పి.శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఐ కాశీనాథ్, ప్రిన్సిపాల్ మల్లినాథప్ప పాల్గొన్నారు.



దౌల్తాబాద్ పాఠశాలలో నల్లాను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పాఠశాలల్లో పనులను నాణ్యతగా చేపట్టాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

దౌల్తాబాద్, జూన్ 25: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను నాణ్యతగా చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం జెడ్పీ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గోకఫస్లాబాద్, దేవరఫస్లాబాద్ గ్రామాల పాఠశాలల్లో చేస్తున్న పనులను తనిఖీ చేశారు. దౌల్తాబాద్‌లో జరుగుతున్న పనులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యతుంటేనే బిల్లులు మంజూరు అవుతాయన్నారు. పాఠశాల ఆవరణను పరిశీలించి చెత్తచెదారం లేకుండా చూడాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఆట స్థలాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల్లేక విద్యార్థులు ఫెయిల్ అయ్యారని, ప్రత్యేక చొరవతో అధ్యాపకులను, ప్రిన్సిపాల్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు ప్రభాకర్ కలెక్టర్‌ను కోరారు. జెడ్పీ పాఠశాలలో వంట గది అపరిశుభ్రంగా ఉందని, కొత్తగా గది నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎంపీడీవో విజయలక్ష్మితో కలెక్టర్ తెలిపారు. గోకఫస్లాబాద్ పాఠశాలలో పనులు సరిగా చేయడం లేదని హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైన పనులు కాకుండా అనవసర పనులు చేయిస్తున్నారన్నారు. టాయ్‌లెట్లు, ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. దేవరఫస్లాబాద్‌లో యూపీఎస్‌లో చేస్తున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ హెచ్‌ఎం రఘును అభినందించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీవో రవీందర్, ఏపీవో రజనీకాంత్ ఉన్నారు.

బలహీనంగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలి

వికారాబాద్: బలహీనంగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. అంగన్వాడీల బలోపేతం, పిల్లలకు యూనిఫామ్‌ల తయారీ, తాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, దివ్యాంగుల, వయోవృద్ధుల సమస్యలపై మహిళా, శిశు సంక్షేమ శాఖల కార్యదర్శి వాకాటి కరుణ హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌కు పలు సూచనలు చచేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలోని 1,107 అంగన్వాడీల్లో మంజూరైన పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చేపట్టిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. బలహీనంగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం, బాలామృతాన్ని ఇవ్వాలన్నారు. దివ్యాంగులకు సదరమ్ క్యాంపుల్లో సర్టిఫికెట్లు ఇవ్వాలని, అలాగే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో రిజర్వేషన్ ప్రాతిపదికన అవకాశాలిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలసదనం, శిశు గృహాలను తాను త్వరలో సందర్శిస్తానని చెప్పారు. ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరమ్మ, ఎఫ్ఆర్వో వెంకటేష్, సఖి కేంద్రం అధికారి యశోద, బాలల పరిరక్షణ అధికారి ఆంజనేయులు, శిశు గృహ మేనేజర్ శోభారాణి పాల్గొన్నారు.

- భూ ఆరోగ్యకార్డుల జారీకి సన్నాహాలు
- ఆగస్టులో జారీ చేసే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 10వేల సాయిల్ టెస్టుల లక్ష్యం
- వానాకాలం 25శాతం నమూనాలే సేకరణ

ఎట్టకేలకు రైతులకు శుభవార్త అందింది. వ్యవసాయ భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షల్లో వచ్చిన వివరాలతో రైతులకు భూ ఆరోగ్య కార్డులు కూడా అందించేందుకు సర్కారు సన్నాహాలు చేస్తోంది. అయితే, ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడం, చాలామంది రైతులు విత్తనాలు వేసుకోవడంతో మట్టి నమూనాలను ఈ వానాకాలంలో తక్కువ సేకరించనున్నారు. ప్రతీ అయిదెకరాలకు ఒక మట్టి నమూనా తీసుకుని పరీక్షలు నిర్వహిస్తారు. వీటిని సంబంధిత ల్యాబ్‌కు పంపించి ఫలితాలను సాయిల్ హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటి ఆధారంగా రైతులకు భూ ఆరోగ్య కార్డులు జారీ చేస్తారు.



ఎట్టకేలకు భూసార పరీక్షలు



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ వికారాబాద్, ఆంధ్రజ్యోతి/ మేడ్చల్, ఆంధ్రజ్యోతి :

భూసార పరీక్షలపై ఎట్టకేలకు సర్కార్ నిర్ణయం తీసుకుంది. కేంద్రం గతంలో ప్రకటించిన విధంగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు భూఆరోగ్య కార్డులను అందించే ప్రక్రియను మొదలు పెట్టింది. ప్రతీ ఏటా వానాకాలం ఆరంభానికి ముందే భూసార పరీక్షలు నిర్వహించి వీటి ఆధారంగా వ్యవసాయాధికారులు రైతులకు ఎరువులు సిఫారసు చేస్తుంటారనే విషయం తెలిసిందే. అయితే, ఈ ఏడాది వర్షాలు ఆరంభమైనా భూసార పరీక్షలపై సర్కార్ నుంచి ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో అధికారులు కూడా దీనిపై ముందుకు వెళ్లలేదు. మరో వైపు అనేకమంది రైతులు భూసార పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూసార పరీక్షలపై ఆలస్యంగానైనా నిర్ణయం తీసుకుంది. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా భూసార పరీక్షలు నిర్వహించి వీటి ఫలితాలను రైతులకు అందచేసేందుకు కార్యాచరణ మొదలు పెట్టింది. దీంతో వ్యవసాయ విస్తరణ అధికారులు ఉమ్మడి జిల్లాలో భూసార పరీక్షల ప్రక్రియ మొదలు పెట్టారు. ఇప్పటికే 2024-25 సంవత్సరానికి మట్టి నమూనాలు సేకరించే విధానం, ఫలితాల వెల్లడికి సంబంధించి వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చింది. అలాగే భూసార పరీక్షలకు సంబంధించి భూఆరోగ్య కార్డులను రైతులకు అందించి వారికి అవగాహన కల్పించింది. శిక్షణ తీసుకున్న అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. వ్యవసాయ పనులు ఆరంభం కావడంతో వానాకాలం సీజన్‌లో భూసార పరీక్షల లక్ష్యాలను తగ్గించి రబీలో పెంచారు. ఇప్పటికే వర్షాలు మొదలు కావడంతో రైతులు మెట్ట ప్రాంతాల్లో వివిధ పంటలు వేస్తున్నారు. దీంతో లక్ష్యాలను తగ్గించి తొలి విడత 25శాతం భూసార పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భూసార పరీక్షల నిర్వహణ ప్రక్రియ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10,398 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడాది భూసార పరీక్షలకు సమయం ఎక్కువ లేనందున వానాకాలంలో తక్కువ శాంపిల్స్ తీసుకుని రబీలో ఎక్కువ సేకరించే విధంగా ప్రణాళిక రూపొందించింది. ప్రతి జిల్లాకు ఒక మండలాన్ని ఎంపిక చేసి ఆ మండలంలో ఎంపికచేసిన గ్రామాల్లో మొత్తం నమూనాలను సేకరించాలని నిర్ధేశించింది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ వానాకాలం 25శాతం భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రబీలో 75శాతం శాంపిల్స్ సేకరించనున్నారు. ప్రతి ఐదెకరాలకు ఒక మట్టి నమూనా తీసుకుని పరీక్షలు చేస్తారు. వీటిని ల్యాబ్‌కు పంపి వీటి ఫలితాలను సాయిల్ హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటి ఆధారంగా రైతులకు భూఆరోగ్య కార్డులు ఇస్తారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10,398 భూసార పరీక్షలు నిర్వహిస్తుండగా రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది 3,720 భూసార పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో 930 మట్టి నమూనాలు ఈ వానాకాలంలో తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్నారు. నందిగామ మండలం చేగూరు, మామిడిపల్లి, ఏదులపల్లి, నందిగామ, వీర్లపల్లిలో సాయిల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మిగతా 2,790 మట్టి నమూనాలను యాసంగిలో సేకరిస్తారు. నమూనా సేకరణ విధానంపై ఏఈవోలకు శిక్షణిచ్చారు.

వికారాబాద్ జిల్లాలో...

వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది 3,978 భూసార పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇందులో భాగంగా ఈ వానాకాలంలో 995 మట్టి నమూనాలు తీసుకోవాలని లక్ష్యం కేటాయించగా, ఆ నమూనాలన్నీ కోట్‌పల్లి మండల పరిధిలో తీసుకోనున్నారు. వచ్చే యాసంగిలో మిగతా మండలాల్లో 2,983 మట్టి నమూనాలు సేకరించనున్నారు.

మేడ్చల్ జిల్లాలో...

మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది 2,700 భూసార పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో భాగంగా ఈ వానాకాలంలో 675 మట్టి నమూనాలు తీసుకోవాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. మిగతావి వచ్చే యాసంగిలో చేపడతారు. కీసర మండలం యాద్గర్‌పల్లి(ఈస్ట్,వెస్ట్), గోధుమకుంటలో మట్టి నమూనాలు సేకరిస్తున్నారు.

అంతా యాప్ ద్వారానే...

భూసార పరీక్షలకు సంబంధించి మట్టి నమూనాల సేకరణ, ఫలితాల వెల్లడి ఈసారి కొత్త విధానంలో చేపడుతున్నారు. శిక్షణ పొందిన వ్యవసాయాధికారులు మట్టి తీయాల్సిన పొలం వద్దకు వెళ్లి నిలబడి ఫొటో తీయాలి. దీన్ని సాయిల్ హెల్త్ కార్డు పోర్టల్ యాప్‌నులో అప్‌లోడ్ చేయాలి. అంతేకాక నమూనాలు తీసిన ప్రదేశం రేఖాంశాలు, అక్షాంశాలతో పాటు పొలానికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయాలి. ఆ తరువాత రైతు వివరాలతో పాటు మట్టి నమూనాలను ప్రయోగశాలకు పంపిస్తారు. ఎంపిక చేసిన గ్రామంలో ప్రతీ అయిదెకరాలకు ఒక శాంపిల్ తీయాలి. ఈ ప్రక్రియను జూలై 10వరకు పూర్తి చేయాలి. ఏదైనా ఇతర సమస్యలు ఎదురైతే జూలై నెలాఖరు వరకు తుది గడువు విధించారు. అనంతరం ఈ ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి ఆగస్టు 20 నాటికి రైతులందరికీ భూఆరోగ్య కార్డులు ముద్రించి రైతు వేదికల్లో పంపిణీ చేయాలి. ఆ సమయంలో వ్యవసాయాధికారులు రైతులతో సమావేశమై పొలంలో ఏ పోషకాలు తక్కువ, ఎక్కువ ఉన్నాయో వివరించి వారికి తగిన సూచనలు, సలహాలు అందజేయాలి. ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలి.



రాంపూర్‌లో సర్వే నంబర్ 9 భూమిలో అనుమతులు లేకుండా చేపడుతున్న మట్టి తవ్వకాలు

అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు

- యథేచ్ఛగా జాతీయ రహదారి పనులకు తరలింపు
- అనుమతుల్లేవంటున్న మైనింగ్, రెవెన్యూ శాఖలు
- అక్రమంగా తరలింపుతో ప్రభుత్వ రాయల్టీకి గండి
- టిప్పర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలింపు

తాండూరు రూరల్, జూన్ 25: తాండూరు మండలం రాంపూర్ శివారులోని ఓ వ్యవసాయ పొలం నుంచి అక్రమంగా మట్టి(మొరం)ని తరలిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి లేకుండా టిప్పర్లతో మొరాన్ని ఎన్‌హెచ్‌హైవే పనులకు అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీకి గండి కొడుతున్నారు. రాంపూర్ పరిధి సర్వే నంబర్ 9లో బంటు నారాయణ అనే రైతు పొలం ఉంది. ఇక్కడ ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతూ మొరాన్ని నేషనల్ హైవే పనులకు తరలిస్తున్నారు. మట్టి అమ్మకానికి రైతు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతేదీ తీసుకోలేదు. రోజూ వందల టిప్పర్లతో మొరాన్ని హైవే పనులకు తరలిస్తున్నారు. గనుల శాఖకు రావాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు.

పర్మిషన్ పేరుతో బోల్తాకొట్టించే యత్నం

నారాయణ తన పొలం నుంచి మొరాన్ని తరలించేందుకు అనుమతివ్వాలని రెవెన్యూ అధికారులకు గత నెలలో దరఖాస్తు చేశారు. రెవెన్యూ సిబ్బంది పూర్తి వివరాలతో మట్టి తరలింపు అనుమతి కోసం మైనింగ్ ఏడీకి నివేదికిచ్చారు. అయితే మైనింగ్ శాఖ ఇంకా నుంచి అనుమతి రాలేదు. కేవలం రెవెన్యూ సిబ్బంది మైనింగ్ శాఖకు ఎండార్స్ చేసిన లెటర్ కాపీని చూపుతూ మట్టి తరలిస్తున్నారు. తాండూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నేషనల్ హైవే విభాగంలో పని చేస్తూ రెవెన్యూ, మైనింగ్ అధికారులను పర్మిషన్ పేరుతో బోల్తా కొట్టించాడు. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు మొరం తవ్విన చోట కొలతలు తీసి క్యూబిక్ మీటర్ ప్రకారం జరిమానా విధించాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : ఆర్డీవో శ్రీనివాస్‌రావు

రాంపూర్‌లోని సాగుభూమి నుంచి అనుమతి లేకుండా మొరాన్ని తరలిస్తున్న విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. కేవలం రెవెన్యూ అధికారులిచ్చిన నివేదిక ఆధారంగా మట్టిని తరలించడం అక్రమం అన్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారుల కూడా అనుమతులు లేకుండా మట్టిని ఎలా తీసుకెళ్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది టిప్పర్లతో మట్టిని తరలిస్తూ మైనింగ్ శాఖకు రాయల్టీ చెల్లించక పోవడం చట్టవిరుద్ధం అన్నారు. ఇప్పటికే తవ్విన మొరం గుంతను పరిశీలించి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానన్నారు. కాగా నేషనల్ హైవే పనులకు పర్మిషన్ లేకుండా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. టిప్పర్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించారు.

గ్రామస్తులపై పొలం యజమాని దౌర్జన్యం

రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుంచి పర్మిషన్ లేకుండా పొలం యజమాని మొరాన్ని తరలిస్తున్నారు. అనుమతి పత్రాలు చూపించాలని కోరిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. గ్రామ సమీపంలో పెద్ద గుంత తవ్వుతున్నారని, భవిష్యత్తులో నీరు నిండితే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని గ్రామస్తులు అంటున్నారు. రోజూ మట్టిటిప్పర్లు తిరుగుతుండడంతో గ్రామ రోడ్డంతా ధ్వంసమవుతోందని వాపోతున్నారు.

ఎర్రమట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంత



మొక్కవోని దీక్షతో..

- ముఖం చాటేసిన వరుణుడు
- చేనును కాపాడుకునేందుకు నీటిని స్ప్రే చేస్తున్న వైనం

వారం క్రితం వరకు అడపాదడపా వర్షాలు కురువగా రైతులు విత్తనాలు విత్తారు. ఒక్క సారిగా వర్షాలు ముఖం చాటేశాయి. మొలకలెండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు లేక వాడుతుండడంతో రైతుల గుండె తరుక్కుపోతోంది. దీంతో మొలకలకు ప్రాణం పోసే పనులు చేపడుతున్నారు. వికారాబాద్ మండలం నారాయపూర్‌లో రాజు అనే రైతు మంగళవారం ఎండుతున్న పత్తి మొలకలకు స్ప్రేయర్‌తో నీటిని పిచికారి చేశాడు. రేపో ఎల్లుండో వానొచ్చినా అప్పటి వరకు మొలకలు బతకాలనే నీటిని స్ప్రే చేస్తున్నట్టు రైతు తెలిపాడు. పోయినసారి కంటే ఈ సారి మరింత కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతు వాపోయాడు. ఇప్పటి వరకు తగినన్ని వర్షాలు కురవక విత్తనాలు కూడా సరిగా మొలకెత్తలేదని అతడు తెలిపాడు.

వికారాబాద్, జూన్ 25

మొలకలకు నీటిని స్ప్రే చేస్తున్న రైతు రాజు



బడిబాట అడ్మిషన్లు 1,860

- అంతంతమాత్రంగా 'బడిబాట' నిర్వహణ
- టీచర్ల బదిలీ ప్రక్రియతో కొంత ఆటంకం

మేడ్చల్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల ప్రవేశాలను పెంచేందుకు నిర్వహించిన బడిబాట కార్యక్రమం ముగిసింది. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1,860 మంది బాలలు అడ్మిషన్లు పొందినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. పిల్లలను బడుల్లో చేర్చుకోవడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంతో ఆశించిన మేర ప్రవేశాలు పెంచలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బడిబాట మొదలవగానే ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఎక్కువ మంది ఉపాధ్యాయులు టాన్స్‌ఫర్లు, ప్రమోషన్లపైనే ధ్యాసపెట్టారు. బదిలీల్లో వారి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా ఎస్జీటీల బదిలీలతో 'బడిబాట'ను సమర్థంగా నిర్వహించలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మొగ్గుచూపడంతో ఎక్కువ మంది ప్రైవేట్ బడుల్లోనే చేరారు.

నేడు జడ్పీ నూతన భవనం ప్రారంభోత్సవం

- ఫలించిన చైర్‌పర్సన్ సునీతారెడ్డి కృషి
- ప్రారంభించనున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



వికారాబాద్, జూన్ 25 : ఎట్టకేలకు హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి కృషి ఫలించనుంది. జిల్లా పరిషత్ నిధులు రూ.5కోట్లతో నిర్మించిన పరిషత్ నూతన భవనం నేడు(బుధవారం) ఉదయం 11గంటలకు ప్రారంభం కానుంది. వికారాబాద్-పరిగి రోడ్డులో నిర్మించిన జడ్పీ భవ ప్రారంభోత్సవానికి అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భవన గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఈ కార్యక్రమానికి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి,యాదయ్య, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు హాజరవుతారని చైర్‌పర్సన్ తెలిపారు.

అడవిలో వేట

- రాత్రి వేళ కాల్పుల శబ్దాలు
- భయాందోళనల్లో మద్గుల్ చిట్టంపల్లి వాసులు
- రంగంలోకి ఫారెస్ట్ అధికారులు
- రిసార్ట్‌లో కత్తి, బ్యాటరీ స్వాధీనం

వికారాబాద్, జూన్ 25: రాత్రిపూట వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతున్నారు. అడవిలో తిరుగుతూ కొందరు సరదా కోసం వేటాడుతుంటే మరికొందరు వన్యప్రాణులను చంపి తినేందుకు వేటాడుతున్నారు. ఫారెస్ట్ అధికారుల గస్తీ ఉండడంతో వారి నుంచి తప్పించుకునేందుకు రిసార్ట్‌ల పరిసరాలను వేటగాళ్ల అడ్డాగా చేసుకుంటున్నారు. నెమళ్లు, జింకలు, దుప్పిలు, అడవిపందులను వేటాడుతున్నారు. వన్యప్రాణు మాంసాన్ని కొందరు అక్కడే వండుకొని తింటూ మజా చేస్తుండగా కొందరు ఇతర ప్రాంతాల్లో అమ్ముకుంటున్నారు. వికారాబాద్ పరిధిలో అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి తుపాకి కాల్పుల శబ్దం విన్పించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. మద్గుల్ చిట్టంపల్లి సమీపంలోని ఓ రిసార్ట్ పరిసరాల్లో ఈ శబ్దాలు విన్పించాయని గ్రామస్తులు తెలపడంతో ఫారెస్ట్ అధికారులు రంగప్రవేశం చేశారు. మద్గుల్ చిట్టంపల్లి సమీపంలోని 'లాస్ట్ ఇన్ విలేజ్' రిసార్ట్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అక్కడి పనివారిని విచారించి ఓ జీపును స్వాధీనం చేసుకున్నారు. జీపులో కత్తి, లైటింగ్ కోసం వినియోగించే బ్యాటరీని గుర్తించారు. జీపు సీటు కింద, కత్తికి రక్తపు మరకలుండడంతో వాహనాన్ని ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. ఆర్ఎఫ్‌వో అరుణ, ఎస్ఎస్‌వో, ఫారెస్ట్ అధికారులు రిసార్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏ జంతువునైనా చంపారా? అని పరిశీలించారు. రక్తపు మరకలను టెస్ట్ కోసం ల్యాబ్‌కు పంపారు.



రిసార్ట్‌లో విచారిస్తున్న ఫారెస్ట్ అధికారులు

ఎవరు వేటాడారు? రిసార్ట్ ఓనర్లా లేక బయటి వారా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. నవాబులకు కొందరు స్థానికులు సహకరించడం వల్లే ఇక్కడ తరచూ రాత్రిపూట వేటాడుతున్నారని అధికారులకు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్‌ను వివరణ కోరగా.. లభించిన ఆధారాల ద్వారా విచారణ చేస్తున్నామని, అడవిలో ఎవరైనా వేటాడినట్లు తేలితే వన్యప్రాణుల రక్షణచట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి


శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

కొడంగల్, జూన్ 25: పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారిగా కొడంగల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి పరిస్థితులు, శాంతి భద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సీఐ, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్‌రెడ్డి పోలీసు సిబ్బందితో నిర్వహించిన గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ కావడంతో ఎస్పీ ఆకస్మిక సందర్శనతో శాంతిభద్రతలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోగల శిథిలావస్థలో ఉన్న పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించి వివరాలను సేకరించారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను తొలగించి నూతన క్వార్టర్స్ నిర్మాణానికి అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఉన్నారు.

పరిగి: పరిగి పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం సందర్శించారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ మొదటిసారిగా పరిగి పీఎస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సిబ్బంది గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. డీఎస్పీ, సీఐలతో మాట్లాడి ఇక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలని సూచించారు. మరోసారి పరిగికి వస్తానని సిబ్బందికి తెలిపారు. ఫిర్యాదు దారులు, ప్రజలపట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సంతోష్ సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కళాశాలకు స్థల పరిశీలన


మాట్లాడుతున్న శంకర్‌నాయక్

బొంరాస్‌పేట్, జూన్ 25: వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ మంగళవారం బొంరాస్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, జడ్పీహెచ్ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళాశాలకు తరగతి గదుల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు వారు తరగతి గదులను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం దగ్గర కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే కళాశాలలో తరగతులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధిహామీలో రూ.70వేల అవినీతి


సామాజిక తనిఖీ బహిరంగ సభలో పాల్గొన్న అధికారులు

బొంరాస్‌పేట్, జూన్ 25: ఉపాధిహామీ పథకం పనుల్లో రూ.70వేలు అవినీతి జరిగినట్లు ఉపాధిహామీ సిబ్బందికి అధికారులు జరిమానా విధించారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా జరిమానా విధించినట్లు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని 46 గ్రామ పంచాయతీల్లో జరిగిన రూ.6.94కోట్ల పనులకు వారం రోజుల పాటు సామాజిక తనిఖీ సిబ్బంది నివేదికలు సమర్పించడంతో మండల స్థాయిలో జరిగిన బహిరంగ సభలో అధికారులు రూ.70వేలు అవినీతి జరిగినట్లు వెల్లడించడం గమన్హారం. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ అధికారులు రవి, సరళ, భార్గవి, సిబ్బంది గంగరాజు, స్వామి పాల్గొన్నారు.

పరిగిలో గుట్కా పట్టివేత


పట్టుబడిన గుట్కాలతో ఎస్ఐ, సిబ్బంది

పరిగి, జూన్ 25: పరిగిలో నిషేధిత గుట్కా పట్టుబడింది. పట్టణంలోని గాంధీచౌక్‌లోని బాలాజీ కిరాణషాపులో సోమవారం రాత్రి తనిఖీ చేయగా గుట్కాలు లభించాయి, గుట్కాల విలువ రూ.10వేలు ఉంటుందని ఎస్ఐ సంతోష్ తెలిపారు. గుట్కాలను స్వాధీనం చేసుకుని షాపు యజమాని కిషోర్‌కుమార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కులకచర్ల ప్రభుత్వాసుపత్రి తనిఖీ


మాట్లాడుతున్న జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి సాయిబాబా

కులకచర్ల, జూన్ 25: కులకచర్ల ప్రభుత్వాసుపత్రిని మంగళవారం జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి సాయిబాబా ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారు. సరైన వైద్యం అందుతుందా? లేదా? అని అడిగారు. రోజుకు ఎంతమంది వైద్యులు విధుల్లో ఉంటున్నారని వైద్యురాలు మాధురితో అడిగి తెలుసుకున్నారు. ప్రతీనెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి? మందులు ఉన్నాయా? అని ఆరాతీశారు. ఆస్పత్రిలోని అన్ని గదులను పరిశీలించారు. ముఖ్యంగా గర్భిణులు మూడు నెలల్లోపే వారి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఐరన్ కాల్షియం మాత్రలు తీసుకోవాలన్నారు. మూడు నెలల్లో మొదటి డోస్, 5 నెలల్లోపు రెండవ ఇంజక్షన్ తీసుకోవాలన్నారు. రక్తం తక్కువగా ఉన్న వారికి ఆసుపత్రిలో ఐరన్ సుక్రోజ్ ఎక్కించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా గర్భిణులు అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వాజీహుద్దీన్, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఆరోగ్య సిబ్బంది సుజాత పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఏటికాల్వ గండి పూడ్చివేత


ఏటి కాల్వ గండి పూడ్చివేతను పరిశీలిస్తున్న గ్రామస్థులు

బొంరాస్‌పేట్, జూన్ 25: గత వర్షాకాలంలో ఏటికాల్వకు పడిన గండిని బొంరాస్‌పేట్ గ్రామ పెద్దలు, రైతులు ఎట్టకేలకు పూడ్చివేశారు. బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు ప్రధాన ఆయువు అయిన ఏటికాల్వకు గండిపడటంతో వచ్చే వరద నీరంతా వాగులోకి వెళ్లే అవకాశం ఉంది. గ్రామ రైతుల కోరిక మేరకు ఇరిగేషన్ అధికారుల సూచనతో గ్రామ పెద్దలు వీరేశం, నీరటి గోపాల్ తదితరులు జేసీబీలతో ఏటి కాల్వకు పడిన గండిని పూడ్చివేశారు. రెండు జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా రెండు రోజుల పాటు ఈ గండి పూడ్చివేతను చేపట్టారు. దీంతో వరద నీరు బొంరాస్‌పేట్ పెద్ద చెరువులోకి చేరడంతో రైతుల పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తంచేశారు.

ఏసీఈ కళాశాలలో నాసా యాప్ ఛాలెంజ్ హ్యాక్‌థాన్


ఏసీఈ కళాశాలలో హ్యకథాన్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ బీఎల్ రాజు

ఘట్‌కేసర్ రూరల్ జూన్ 25: అంకుషాపూర్ ఏసీఈ కళాశాలలో ఫౌండర్ ల్యాబ్, ఎస్‌యూఎంవీఎన్ సౌజన్యంతో సోమవారం 24గంటల నాసా యాప్ ఛాలెంజ్-2024 హ్యాక్‌థాన్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ రాజు, ఎస్‌యూఎంవీఎన్ ఫౌండర్ సాయికిరణ్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి హ్యాకథాన్ ప్రారంభించారు. హ్యాకథాన్‌లో విద్యార్థులు స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన యాప్‌లను అభివృద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గప్రసాద్, శ్రవణ్, శ్రీలత, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తదితరులు

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

ఆమనగల్లు, జూన్ 25: మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని అన్నారు. పోల్కూర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని మంగళవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సందర్శించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామాంజనేయ స్వామి దేవాలయ పెయింటింగ్ పనుల నిమిత్తం ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఆలయ నిర్వాహకులకు రూ.2.60 లక్షలు విరాళం అందజేశారు. సుంకిరెడ్డిని నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామచందర్ రెడ్డి, భగవాన్, హన్మంత్, జంగిరెడ్డి, రాంరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, అభినవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న దళిత సంఘం నాయకులు

మధుసూదన్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలి

షాబాద్, జూన్ 25 : దళిత విద్యార్థిపై దాడి చేసిన మధుసూదన్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు షాబాద్‌లో కంది-షాద్‌నగర్ రహదారిపై మంగళవారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి సంఘాల నాయకులతో మాట్లాడి నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన బేగరి యాదగిరిపై మధుసూదన్‌రెడ్డి దాడి చేయడం సరికాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మధుసూదన్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్, ఆల్ ఇండియా యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు ఆంజనేయులు, విశ్వం, శ్రీశైలం, మహేష్, శ్రీనివాస్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

చనిపోయినా.. మరొకరికి కంటిచూపు

» నేత్రదానంతో ఆదర్శంగా నిలిచిన వృద్ధురాలు

షాబాద్, జూన్ 25 : ఓ వృద్ధురాలు తాను చనిపోయినా మరొకరికి కంటి చూపునిచ్చి ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. మండల పరిధిలోని ఎర్రోనిగూడ గ్రామానికి చెందిన సామ రుక్కమ్మ (90) సోమవారం మృతి చెందింది. అయితే, ఆమె అంతకుముందు.. తన మరణానంతరం కళ్లను దానం చేయడానికి ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి హామీ పత్రం ఇచ్చారు. ఈమేరకు ఆమె మరణవార్త తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా రుక్కమ్మ సామాజిక స్పృహను పలువురు కొనియాడారు. ప్రతీఒక్కరు మరణాంతరం కళ్లను దానం చేయాలని రుక్కమ్మ కుమారుడు సామ మాధవరెడ్డి, మనవడు మహేందర్‌రెడ్డి కోరారు.


రుక్కమ్మ (ఫైల్)


సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయాధికారి అశోక్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తాండూరు, జూన్ 25: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జ్ఞానవి జ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఐ కాశీనాథ్, కళాశాల ప్రిన్సిపల్ మల్లినాథప్ప పాల్గొన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

తాండూరు, జూన్ 25: ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాండూరు పట్టణం అంబేద్కర్ చౌక్‌లో మంగళవారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. యూజీసీ నీట్ రద్దుకు బాధ్యత వహించి రీ ఎగ్జామ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లీక్‌తో కేంద్రం పరువు తీసుకుందన్నారు. నీట్ రద్దుకు బాధ్యత వహించి అభ్యర్థుల నుంచి వసూలు చేసిన అప్లికేషన్ ఫీజును రీఫండ్ చేసి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


తాండూరు అంబేడ్కర్ చౌక్ వద్ద పీడీఎస్‌యూ నిరసన

మెటల్ రోడ్డును బీటీగా మార్చాలి

యాలాల, జూన్ 25: మండలంలోని దేవనూర్ నుంచి దుబ్బ తండా వరకు ఉన్న మెటల్‌రోడ్డును బీటి రోడ్డుగా మార్చాలని దుబ్బ తండావాసులు కోరారు. దేవనూరు నుంచి దుబ్బతండా వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న మెటల్ రోడ్డు వర్షాకాలంలో గుంతలుపడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోజూ దెబ్బతండా నుంచి దేవనూర్, తాండూరు, ఇతర ప్రాంతాలకు విద్యార్థులు, గ్రామస్థులు వెళ్లి వస్తుంటారని చెప్పారు. వర్షాకాలంలో ఈ రోడ్డు పూర్తిగా పాడై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని తండావాసులు కోరుతున్నారు.


దుబ్బ తండాకు వెళ్లే మెటల్ రోడ్డు

'అంగన్‌వాడీ' చిన్నారులకు ఉచితంగా యూనిఫాం

» ఈ విద్యా సంవత్సరం నుంచే అందించాలని ప్రభుత్వ నిర్ణయం

» జూలై నుంచి పంపిణీ చేసే అవకాశం!

చేవెళ్ల, జూన్ 25 : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం వినూత్నంగా ఆయా పథకాలను ముందుకు తీసుకొస్తున్నాయి. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడీ పిల్లలకు ఉచితంగా యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలో చదుతున్న విద్యార్థులకు మాత్రమే ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సైతం ఉచితంగా యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చేవెళ్ల డివిజన్ పరిధిలో 255 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 14,379 మంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే, తల్లిదండ్రులు నాలుగేళ్ల నుంచే నర్సరీ అంటూ ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్చే క్రమంలో మొదటగా 3 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు ఈ విద్యాసంవత్సరం నుంచి యూనిఫాం అందించాలని నిర్ణయించారు. ఈమేరకు జిల్లా ఐసీడీఎస్ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దాంతో అంగన్‌వాడీ కేంద్రాల వారీగా పిల్లల వివరాలను అధికారులు సేకరించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు చేవెళ్ల ఐసీడీఎస్ డివిజన్‌లో 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు మొత్తం 14,379 మంది ఉన్నారు. చేవెళ్ల మండలంలో 66 కేంద్రాలు ఉండగా.. 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 3,647 మంది ఉన్నారు. అదేవిధంగా షాబాద్ మండలంలో 69 కేంద్రాల్లో 3,005 మంది, శంకర్‌పల్లి మండలంలో 63 కేంద్రాలకు గాను 3,947 మంది పిల్లలు ఉన్నారు. మొయినాబాద్ మండలంలో 57 కేంద్రాల్లో మొత్తం 3,780 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చి నివేదికలు సమర్పించారు.

యూనిఫాం తయారీ మహిళా సంఘాలకు..

అంగన్‌వాడీ చిన్నారులకు అందించే యూనిఫాం.. మగపిల్లలకు షర్ట్, నెక్కర్, ఆడపిల్లలకు ఫ్రాగ్ అందించాలని నిశ్చయించి డిజైన్‌ను ఎంపిక చేశారు. డ్రెస్సులను కుట్టించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ అధికారులకు క్లాత్‌ను అప్పగించింది. ఈ శాఖ పరిధిలో ఉన్న మహిళా శక్తి సంఘాలు ఆయా డిజైన్లలో డ్రెస్సులను కుట్టి ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు యూనిఫాం కుడుతున్నందున.. వారికే అప్పగిస్తే మహిళా శక్తి సంఘాల సభ్యులకు ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి జులై నెలాఖరు వరకు పంపిణీ చేయాలని యోచిస్తున్నారు.



ఈ విద్యాసంవత్సరం నుంచే పంపిణీ చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకుగాను ఈ విద్యాసంవత్సరం నుంచే పిల్లలకు ఉచితంగా యూనిఫాం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులతోపాటు సంబంధించిన యూనిఫాం మెటీరియల్‌ను డీఆర్‌డీఏ శాఖ అధికారులకు అప్పగించారు. వచ్చేనెల వరకు యూనిఫాం కుట్టించి పంపిణీ చేసే అవకాశం ఉంది.

- శోభరాణి, సీడీపీవో, చేవెళ్ల

యంత్రాలపై అందని రాయితీ

» రైతులకు భారంగా మారిన వ్యవసాయం

కొడంగల్ రూరల్, జూన్ 25: ఆరుగాలం ఎండకు, వానకు ఓర్చి చెమటను చిందించి పంటను సాగుచేస్తున్నారు రైతులు. వారికి ప్రకృతి సహకరిస్తేనే పెట్టిన పెట్టుబడి చేతికొస్తుంది. సాగుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో గతంలో ప్రభుత్వాలు అనేక యంత్రాల పరికరాలపై రాయితీ అందించేది. అదికాస్త మున్నాళ్ల ముచ్చటే అయింది. కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందించడం లేదు. దీనికి తోడు రోజురోజుకు సాగుఖర్చులు పెరిగి వ్యవసాయం భారంగా మారింది.



ఏళ్లుగా ఇదే పరిస్థితి

గతంలో కాంగ్రెస్ ప్రభ్వుత్వం అధికారంలో ఉన్నప్పుడూ యంత్రలక్ష్మి పథకంతో యంత్రాలపై 50శాతం రాయితీ ఇచ్చేది. రోటోవేటర్‌పై 50శాతం సబ్సిడీ, 33శాతంపై పిచికారి పరికరాలను రైతులకు అందించేది. కూరగాయ విత్తనాలు, ట్రాక్టర్లు, స్ప్రే పంపులు, కలుపుతీసే యంత్రాలు వరికోత మిషన్లు, టార్ఫాలిన్లు సబ్సిడీపై అందించేవారు. అయితే 2018 తరువాత ఈ పథకం అటకెక్కింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు పథకం అమలు చేయడంతో యంత్రాల సబ్సిడీ పథకాన్ని ఎత్తివేశారు. దీంతో రైతులు యంత్రాల కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో కూలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

యంత్ర పరికరాలతో మేలు

వ్యవసాయం పనుల్లో యంత్రాలు వినియోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుకు ఆవకాశం ఉంటుంది. విత్తనాలు వేయడం, పంటకోత వరకు అన్నిపనులు యంత్రాలతో చేయడం ద్వారా సమయం, కూలీల కొరత తీరడంతో పాటు ఖర్చులు తగ్గుతాయి. వరికోత సమయంలో కూలీలు దొరకక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారంగా మారుతోంది. దీంతో అద్దెకు తీసుకుని పనులు పూర్తి చేసుకుంటున్నారు. వరికోత యంత్రాలను సబ్సిడీపై అందిస్తే ఇబ్బందులు దూరమవుతాయని రైతులు అంటున్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించాలి



ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందించాలి. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి సాగు ఖర్చులు ఆదా అవుతాయి. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి పరికరాలను సన్న, చిన్నకారు రైతులకు రాయితీపై అందించాలి.

డి.వెంకటయ్య, రైతు, టెకులకోడ్

బాలిక ప్రేమించలేదని ఆర్మీ జవాన్ ఆత్మహత్య

బొంరాస్‌పేట్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక తన ప్రేమను అంగీకరించలేదని మనస్థాపానికి గురైన ఓ యువ ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలం కొత్తపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లికి చెందిన కుంట మంగమ్మ-రాములు దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు చింటు(21) 2023లో అగ్నిపథ్ కింద ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. బెంగళూరులో శిక్షణ పూర్తిచేసుకొని ఈ నెల 22న గ్రామానికి వచ్చాడు. 24న సాయంత్రం దాదాపూర్ ఉన్నత పాఠశాల వదిలిన తర్వాత ఓ విద్యార్థిని తోటి విద్యార్థినులతో కలిసి ఇంటికి వెళ్తోంది. ఆ బాలికను చూసిన చింటు తన స్నేహితుడితో కలిసి బాలిక వద్దకు వచ్చి.. 'నేను నిన్ను ప్రేమిస్తున్నా. నా ప్రేమను ఒప్పుకో.' అని బలవంతం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు చింటు ఇంటికి వెళ్లి అతడిని మందలించారు. ఈ ఘటనతో మనస్థాపానికి గురైన చింటు సోమవారం రాత్రి తన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. 'ఊరిలో మన పురువు పోయింది నాన్నా. ఐ మిస్ యూ.' అని కుటుంబ సభ్యులకు ఫోన్ మెసేజ్ పెట్టాడు. ఆందోళనతో కుటుంబ సభ్యులు అదే రాత్రి పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే చింటు ఉరేసుకున్నాడు. తన కొడుకు మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చింటు తండ్రి రాములు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు.


చింటు(ఫైల్)

'ధరణి' పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర రూరల్, జూన్ 25: ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం కీసరలోని రెవెన్యూ డివిజినల్ కార్యాలయాన్ని(ఆర్డీవో) సందర్శించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చొరవ చూపాలని సూచించారు. ఇప్పటి వరకు దాఖలైన దరఖాస్తులు, పరిష్కరించిన, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను కబ్జాకు గురైతే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న విజయేందర్‌రెడ్డి

అరకొర వసతులు.. విద్యార్థుల అవస్థలు

» బషీరాబాద్ సీపీఎస్ పాఠశాలలో తరగతి గదుల కొరత

» నిజాం కాలంనాటి పాత భవనంలో విద్యార్థుల చదువులు


గదుల కొరతతో నిజాం కాలంనాటి పురాతన భవనంలో కొనసాగుతున్న బషీరాబాద్ సీపీఎస్ పాఠశాల

బషీరాబాద్, జూన్ 24: మండల కేంద్రంలోని సీపీఎస్(కేంద్ర ప్రాథమిక పాఠశాల)లో అరకొర వసతుల మధ్య ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇక్కడి పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు గాను 72మంది విద్యార్థులు ఉండగా తరగతి గదులు సరిపోను లేకపోవడంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. నలుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ గదుల కొరత ఇక్కడా తీవ్రంగా ఉంది. నిజాం కాలంనాటి ఓ పురాతన భవనంలో విద్యార్థులను కూర్చోబెట్టి విద్యాబోధన కొనసాగిస్తున్నారు. ఈ గదిలోనే ఓ పక్కన మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు వంటను వండటంపై వచ్చే పోగతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఏళ్ల తరబడి వంటగది మరమ్మతుకు నోచుకోకపోవడంతో వృథాగా మారింది. వర్షాలు కురిస్తే పాత భవనం లీకేజీలతో ఒక్కోసారి విద్యార్థులు కూర్చోవడానికి వీలులేక ఇంటికి పంపించిన సందర్భాలు అనేకమున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అమ్మఆదర్శ పాఠశాల కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పాఠశాల ఆవరణలో కూలిన వంటగది, పక్కన పాడుబడిన భవనం కూల్చివేయడంతో పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. పాఠశాలకు ఓపక్క ప్రహరీ లేకపోవడంతో సమీపంలోని కాలనీ యువకులు కొందరు లోపలికి వచ్చి మద్యం సేవిస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


బషీరాబాద్ సీపీఎస్ పాఠశాలలో వంటగది నిరుపయోగంగా మారిన దృశ్యం


మతిస్థిమితం లేని మహిళతో చేవెళ్ల పోలీస్‌లు

మానవత్వం చాటుకున్న చేవెళ్ల పోలీసు

చేవెళ్ల, జూన్ 25 : మతిస్థిమితం సరిగాలేని ఓ మహిళ పట్ల చేవెళ్ల పోలీసులు మానవత్వం చాటుకున్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పోలీస్‌లు పెట్రోల్ మొబైల్ వాహనంలో తిరుగుతుండగా మతిస్థితం సరిగాలేని ఓ మహిళ రోడ్డుపై కన్పించింది. దాంతో పోలీస్‌లు ఆ మహిళ వద్దకు వెళ్లి పలుకరించగా.. ఎలాంటి సమాధానం రాలేదు. ఒంటిపై చిరిగిపోయిన బట్టలు ఉండడం గమనించి.. వెంటనే కొత్తబట్టలు కొనుగోలు చేసి మహిళా కానిస్టేబుల్ మంజులతో ఆమెకు వేయించారు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో పోలీసులను అభినందించారు. కానిస్టేబుళ్లు అశోక్, మంజుల, డ్రైవర్ జావిద్‌లపై ప్రశంసలు కురిపించారు.

ఆర్‌ఐపై జడ్చర్ల ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

తాండూరు, జూన్ 25: బాలనగర్ గిర్ధావర్ వెంకటొరెడ్డిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసి యేషన్ ట్రెసా వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు భూసమస్యల పరిష్కారానికి సెలవు దినాల్లోనూ పనిచేస్తున్న తరుణంలో తహసీల్దార్ కార్యాలయానికి ఎమ్మెల్యే వచ్చి ఆవేశంతో దూషించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను రెవెన్యూ ఉద్యోగులంతా ఆందోళన చేస్తున్నారని అన్నారు.


విజయేందర్


సంధ్యకు అడ్మిషన్ అందజేస్తున్న గోపాల్ నాయక్

చదువుకు పేదరికం అడ్డుకాదు

ఆమనగల్లు, జూన్ 25: చదువుకు పేదరికం అడ్డుకాదని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ అన్నారు. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ప్రతీ ఒక్కరు తమ వంతు చేయూతనందించి ప్రోత్సహించాలని కోరారు. మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామానికిచెందిన విద్యార్థిని తోడేటి సంధ్య తల్లి చనిపోవడంతో ఆమనగల్లు మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలోని అమ్మమ్మ మండె ఈదమ్మ దగ్గర ఉండి చదువుకుంటోంది. సంధ్య చదువులు వృద్ధురాలైన అమ్మమ్మకు భారంగా మారడంతో ఉప్పల వెంకటేశ్‌ను ఆశ్రయించింది. దీంతో స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సంధ్యకు చదువు చెప్పించడానికి ముందుకు వచ్చారు ఆమనగల్లు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం ట్రస్ట్ తరఫున గోపాల్ నాయక్ అడ్మిషన్ చేయించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వందల మంది పేద పిల్లలకు చదువుకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు తమ వంతు పాలు పంచుకోవాలని గోపాల్ నాయక్ సూచించారు. బుచ్చిబాబు, అశోక్, టిప్పుసుల్తాన్ తదితరులు ఉన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

» మొలకెత్తిన విత్తనాలు వాడుముఖం » ఆందోళనలో అన్నదాతలు

వర్షాలు లేక రైతన్న ఆందోళన

తాండూరు రూరల్, జూన్ 25: తొలకరిలో వర్షాలు కురవడంతో రైతన్నలు సంబురపడ్డారు. ఎంతో సంతోషంతో విత్తనాలు విత్తుకున్నారు. తీరా విత్తనాలు మొలకెత్తే సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో మొలకెత్తిన విత్తనాలు వాడుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు వానాకాలంపై ఆశలు వదులుకుంటున్నారు. తొలకరి వర్షాలతో తాండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో 45,000ఎకరాల్లో పత్తి, 61వేల ఎకరాల్లో కంది, 7500 ఎకరాల్లో పెసర, 7వేల ఎకరాల్లో మినుము, 35వేల ఎకరాల్లో వరి, 2500ఎకరాల్లో సోయాబీన్ తదితర విత్తనాలు నాటారు. మొక్కలు నాటినప్పటి నుంచి వర్షాలు కురియకపోవడంతో కొన్నిమొక్కలు వాడిపోగా మరి కొన్ని విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే కుళ్లిపోయాయి. మండలపరిధిలోని చెంగోల్, ఐనెల్లి, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, అంతారం, కరన్‌కోట్, మల్కాపూర్, నారాయణపూర్ తదితర గ్రామాల్లో ఎర్ర, నల్ల రేగడి నేలల్లో కంది, పెసర, మినుము, పత్తి వంటి పంటలు వేశారు. కానీ వర్షాలు లేక మొలకెత్తలేదు. దీంతో రైతన్నలు విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే తమకు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నామని వారు కన్నీటిపర్యంతమవుతున్నారు.


నారాయణపూర్ గ్రామ శివారులో మొలకెత్తిన కంది మొక్కలు

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



కీసర రూరల్: కుట్టు మిషన్లు స్వీకరిస్తున్న మహిళలతో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర రూరల్, జూన్ 25 : మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్ పరిధిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీ కార్పొరేషన్, ప్రో ఫ్యాషన్ అభయ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ అందజేసిన 70 కుట్టు మిషన్లను మహిళలకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని బాబాగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళ వారం పంచాయతీ స్పెషలాఫీసర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో స్థానిక డ్వాక్రా మహిళలతో మహిళ శక్తి స్వయం ఉపాధి ప్రత్యేక సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సురేష్, బాబాగూడ పంచాయతీ స్పెషలాఫీసర్ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందడానికై ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తోందని తెలిపారు. స్వయం ఉపాధి కింద యూని ట్లను నెలకొల్పడానికై అవసరమైన శిక్ష ణను ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలను ఇవ్వనున్నట్లు చెప్పారు. స్వయం ఉపా ధికి ఆసక్తి, అర్హత గల డ్వాక్రా మహిళలు ముందుకు వచ్చి మండల పరిషత్ కార్యాల యంలో మహిళ శక్తి పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని వారు పిలుపు నిచ్చారు. పంచా యతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వయం ఉపాధి కింద ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రూ.2ల క్షల నుంచి 35లక్షల వరకు రుణాలను ఇప్పించను న్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆ ర్‌డీఏ అధికారులు, వీఓలు, సీసీలు, డ్వాక్రా గ్రూప్‌ల మహిళలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, అలియాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10. 30 గంటలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళ శక్తి పథకం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

మహిళా గ్రామ సభలు

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ లలో మంగళవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వ హించారు. ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్య క్రమాల్లో భాగంగా అధికారులు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక మహిళా గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఇప్పటి వరకు సంఘంలో లేని మహిళలను గుర్తించడం, వారిని సంఘాల్లోచేర్పిం చడం, మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌ను గుర్తించి వాటిని ప్రోత్సహించడం, కుట్టు కేంద్రాలు ఏర్పాటు, పాడి పరిశ్రమ ఏర్పాటు, పౌల్ట్రీ, మదర్ యూనిట్ల ఏర్పాటు, మిల్క్ పార్లర్లు, మొబైల్ షిప్ రిటైల్ ఔట్ లైట్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ మహిళా క్యాంటీన్లు కుట్టు కేంద్రాలు ఏర్పాటు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వంటి తది తర అంశాలపై చర్చించారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 1948మందిని గ్రూపుల్లో చేర్పించడం, మహిళా సంఘ సభ్యులతో 16 మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం, 118 వివోల సభ్యులకు 2613 యూనిట్లను 3013 మంది సభ్యులకు ఇప్పించే విధంగా కార్యాచరణ రూపొం దించినట్లు అధికారులు తెలిపారు.

మూడుచింతలపల్లి: స్వయం ఉపాధి దిశగా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని అద్రాస్‌పల్లి మాజీ సర్పంచ్ లలిత నర్సింహులు అన్నారు. డీఆర్‌డీవో ఆదేశాల మేరకు మండలం లోని మంగళవారం గ్రామాల్లో మహిళా శక్తి సమా వేశాలు నిర్వహించారు. అందులో భాగంగా అద్రా ‌సపల్లిలో నిర్వహించిన సమావేశానికి స్థానిక మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థి కంగా, సామాజికంగా ఎదగటానికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మహిళ సంఘాలు పాల్గొన్నారు.



మహిళాశక్తి సమావేశానికి విచ్చేసిన అధికారులు, డ్వాక్రా మహిళలు



మేడ్చల్: మునీరాబాద్‌లో మహిళా శక్తి సమావేశం



మూడుచింతలపల్లి: సమావేశంలో పాల్గొన్న మహిళలు

కల్యాణలక్ష్మి పేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

దౌల్తాబాద్, జూన్ 25: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథ కాలు పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ విజయ్ కుమార్ అన్నారు. దౌల్తాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మంగ ళవారం 126మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కోట్ల మహిపాల్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ బోడివెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఏహోదాలో పంపిణీ చేస్తున్నారంటూ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో వాగ్వాదానికి దిగారు. తన పదవీకాలం ఉన్నంత వరకైనా ప్రొటోకాల్‌ను పాటించాలన్నారు. అక్కడే ఉన్న ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ మహిపాల్, మాజీ వైస్ ఎంపీపీ బోడివెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కూరవెంకట్రా ములు కల్పించుకొని జడ్పీటీసీ మహిపాల్‌ను సముదాయిం చారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



తాండూరు, జూన్ 25: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న జిల్లా ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు అంకిత్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు.

వర్షాలు కురవాలని వరదపాశం



తరిగోపుల వాగులో బండరాళ్లపై పారించిన వరదపాశం

ధారూరు, జూన్ 25: వర్షాలు కురువాలని అంతారం గ్రామస్థులు మంగళవారం వరద పాశం నిర్వహించారు. తరిగోపుల వాగుకు వెళ్లి బండరాళ్లపై వరుణ దేవు డికి పూజలు చేసి వానలు కురిపించాలని మొక్కుకున్నారు. మహి ళలు నైవేద్యం సమ ర్పించి బండరాళ్లపై పాశం పోసి వాగులోకి వరద పాశం పారించారు.

తైబజార్ వేలం

ధారూరు, జూన్ 25: ధారూరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తైబజారు (కూరగాయల సంత) వేలం నిర్వహించారు. ఈ వేలంలో పంచాయతీ పరిధిలోని తిమ్మనగ ర్‌కు చెందిన కొడిగంటి మహేష్ పాల్గొని రూ.4.08లక్షలకు పాట పాడి ధారూరు తైబజారును దక్కించుకున్నారు. జూలై 2024 నుంచి 2025 మార్చి కాలపరిమితితో తైబజారును అధికా రులు వేలం పాట నిర్వహించారు. వేలంలో ఎంపీడీవో నర్సిం హులు, కార్యదర్శి అంజ్యా నాయక్, అధికారులు, వివిధ రాజ కీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీ డీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు సమక్షంలో తైబజార్ వేలం నిర్వహించారు. వేలంలో ప్రతాప్‌రెడ్డి, జంగంగారి బాగయ్య పోటీపడగా మండల కేంద్రానికి చెందిన జంగం గారి బాగయ్య రూ.2,10,000లకు వేలాన్ని దక్కించుకు న్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన వేలంలో ప్రతీ శనివారం మండల కేంద్రంలో జరిగే సంతలో ఒక్కో దుకాణానికి రూ.30వసూలు చేయాలని నిర్ణయించారు. తైబ జార్ దక్కించుకున్న బాగయ్య 50శాతం డబ్బులు చెల్లించాలని, మిగతా డబ్బును నెలరోజుల్లో గ్రామపంచాయతీకి చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పవిత్ర, రామకృష్ణారెడ్డి, రవికుమార్, శౌకత్‌అలీ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది

కులకచర్ల, జూన్ 25: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. రుణమా ఫీ అమలుకు కెబినెట్ ఆమోదం తెలపడంతో హర్షం వ్యక్తం చే స్తూ మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజ నేయులు ఆధ్వర్యంలో కులకచర్ల చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, కాంగ్రెస్ మండల కార్యదర్శి గోపాల్ నాయక్, ఎంపీటీసీలు ఆనంద్, రాంలాల్‌నాయక్, నాయకులు వెంకటయ్యగౌడ్, హరినాథ్‌రెడ్డి, జలీల్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: రైతు రుణమాఫీని ఏకకాలంలో మాఫీ చే స్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ నాయకు లు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని నాందర్‌పూర్ గ్రా మంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జున్, గ్రా మ కమిటీ అధ్యక్షుడు పి.వెంకటయ్య ఆధ్వర్యంలో మంగళవా రం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

బడిబాట పట్టింది.. 360 మందే

● మండలంలో ఒకటో తరగతిలో తగ్గిన ప్రవేశాలు

బషీరాబాద్, జూన్ 25: ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహించారు. ఈ క్రమంలో ప్రధానోపా ధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలు, ఇంటింటి ప్రచారం చేస్తూ పిల్లలను బడిబాట పట్టేందుకు తమ వంతుగా కృషి చేశారు. ఈ సారి బడిబా టలో బషీరాబాద్ మండలంలో 47 ప్రాథమిక పాఠశాలలు ఉండగా కేవలం 360మంది విద్యార్థులను మాత్రమే ఒకటో తరగతిలో చేర్పించి నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పలుచోట్ల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ సర్కారు బడుల్లో ఉన్న సదుపాయాలు, ఫలితా లను వివరించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు కూడా విద్యాశాఖ పంపిణీ చేసిన ఫలితం మాత్రం కనిపించలేదు. ఏటా తల్లిండ్రులు తమ పిల్లలను ప్రైవేటులో చేర్పించేందుకు ఉత్సుకతను చూపడం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ఆశించిన స్థాయిలో జరగడంలేదని చెప్పవచ్చు.



బడిబాట ర్యాలీలో ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు(ఫైల్)

వానాకాలం సాగుపై అవగాహన



కార్యక్రమానికి హాజరైన అధికారులు

పూడూరు, జూన్ 25: వానాకాలం పంట లసాగుపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రతి మంగళవారం రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమం పేరున వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తోంది ఇందులో భాగంగా పూడూరు రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసా య విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ద్వారా అ వగాహన కల్పించారు. వర్షాకాలంలో వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివార ణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాల పై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రాజేంద్రనగ్ వారిచే పలు యూట్యూబ్ వీడియోలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, సహాయ సంచాలకులు లక్ష్మీకుమా రి, మండల ఏవో తులసీరాం, డివిజన్ విస్తీ ర్ణాధికారులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: వ్యవసాయ శాఖ వీడి యో కాన్ఫరెన్స్‌లో రైతులకు శాస్త్రవేత్తలు పం టల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స లహాలు, సూచనలు చేశారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసా య శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు శాస్త్రవేత్తలతో జరిగిన కాన్ఫరెన్స్‌లో కొ డంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో అనురాధ తో పాటు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ శాఖ అధికారులు లావ ణ్య తదితరులు పాల్గొన్నారు.

యాలాల: యాలాలలో రైతు వేదికలో మంగళవారం నేస్తం కార్యక్రమం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే అమలు చేయ బోతున్న రైతు భరోసా పథకంపై రైతుల యొక్క సూచన, సలహాలను తీసుకోవడం జరిగిందని వ్యవసాయాధికారులు పేర్కొ న్నారు. రైతులు ఇచ్చిన సూచనలను జిల్లా రాష్ట్ర వ్యవసాయ శాఖకు పంపించనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్ర మంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రుద్రమూర్తి, యాలాల ఏవో యాదగిరి, తాండూరు, పెద్దేముల్ , బషీరాబాద్ మండ లాలకు చెందిన వ్యవసాయాధికారులు, వ్యవ సాయ విస్తీర్ణ అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

భారీగా ఉపాధ్యాయ బదిలీలు

తాండూరు రూరల్, జూన్ 25: తాండూరు మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభు త్వం స్థానచలనం కలిగిచింది. దీంతో కొన్ని సంవత్సరాలపాటు పనిచే సిన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో బదిలీ అయిన ఉపాధ్యాయు లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిట్టిఘనాపూర్ ఎల్‌ఎ ఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న కిష్టప్ప చెంగోల్ యూపీఎస్‌కు, మల్కా పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న నాగప్ప జినుగుర్తికి, క రన్‌కోట్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న నర్సిరెడ్డి చిట్టిఘనా పూర్‌కు, అంతారంలో పనిచేస్తున్న శ్రీలత గోనూరుకు, గోనూరులో ప నిచేస్తున్న అమృతమ్మ ఉద్దండాపూర్‌కు, కోటబాస్పల్లిలో పనిచేస్తున్న శేఖర్‌రెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ కుల్కచర్లకు, చెంగోల్‌లో పని చేస్తున్న పద్మ జ పెద్దేముల్ మండల గొట్లపల్లికి, చెంగోల్‌లో పనిచేస్తున్న మల్లికార్జు నస్వామి అంతారంకు, యాలల మండలం జక్కేపల్లిలో పనిచేస్తున్న లీలావతి యూపీఎస్ గౌతాపూర్‌కు, జినుగుర్తిలో పనిచేస్తున్న మాణె మ్మ యాలాల మండలం బషీర్‌మియా తండాకు, బషీరాబాద్ మండ లం నవల్గాలో పని చేస్తున్న సంతోష్‌కుమార్ అంతారంకు, మరో హిం దీ ఉపాధ్యాయుడు సంతోష్ జెడ్పీహెచ్‌ఎస్ బెల్కటూర్, పెద్దేముల్ మండలం మారేపల్లిలో పనిచేస్తున్న లక్ష్మారెడ్డి యూపీఎస్ అంతారం, బషీరాబాద్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బారి కరన్‌కోట్ యూపీఎ స్‌కు బదిలీ అయ్యారు. కరన్‌కోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 మంది, చెంగోల్‌లో ముగ్గురు, మల్కాపూర్‌లో ముగ్గురు, జినుగుర్తి ముగ్గుర మొత్తం 17 మంది ఆయా జిల్లా పరిషత్ ఉన్నతా పాఠశాల లకు బదిలీ అయినట్లు తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. వీరంతా బుధవారం నుంచి విధుల్లో చేరనున్నారని వెల్లడించారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** బీఆ ర్‌ఎస్ సోషల్ మీడియా మం డల ఇన్‌చార్జి నెహ్రూనాయక్ ను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరామర్శించి భరోసా కల్పించారు. ఇటీవల నెహ్రూనాయక్ భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఇందుకు స్పందించిన మా జీ ఎమ్మెల్యే మంగళవారం దేవ్లనాయక్ తండాకు చేరుకొని ఆయనను పరామర్శించా రు. రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కోట్ల యాదగిరి, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** మండలంలోని ఎక్మాయి ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలను కర్ణా టక రాష్ట్రం శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామీణ అభి వృద్ధి యోజన ట్రస్ట్ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసంస్థ ప్రా జెక్టు డైరెక్టర్ మంజూనాథ్, సూపర్‌వైజర్ శ్రీ కాంత్, సేవాసంస్థ ప్రతినిధి రేణుక పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశమయ్యా రు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివా స్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నదీర్గానారాయణ, సా యిరెడ్డి, మధు, అహ్మద్, గ్రామ కార్యదర్శి ర వి తదితరులు

● **శామీర్‌పేట:** శామీర్‌పేట పోలీసు స్టేషన్‌లో విధులను నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్, ఏఎస్‌ఐ కమాల్‌గురి, హెడ్ కానిస్టేబుళ్లు ప్రకాశ్, జ్ఞానేశ్వర్, హిమవంతురావు, మల్లికార్జున్, శ్రీనివాస్ లను బదిలీ చేస్తూ ఇటీవల సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులను జారీచేశారు. వారిని సోమవారం రాత్రి శామీర్‌పేట పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అభినందిస్తూ సన్మానించి వీడ్కోలు పలికారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ పట్టణంలోని ఆర్టీ కాలనీను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి సమస్యలను పరిష్కరిస్తామని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఆర్టీసీ కాలనీలో నర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను దీపిక మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మనసా శ్రవణ్, కమీషనర్ నాగిరెడ్డి, డీఈఈ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు శ్రవణ్, గుప్త కాలనీ వాసులు పాల్గొన్నారు.

● **కీసర రూరల్:** విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేసారు. విద్యార్థుల వినతి మేరకు మంగళవారం నాగారంలోని గిరిజన సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థుల కొరకు వండిన అన్నంతో పాటు కూరలను ఆయన పరిశీలించారు. అన్నంలో పరుగులు ఉండటం, వంట గది నుంచి దుర్వాసన వెలువడు తుండటం పట్ల సంబంధిత వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మారకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● **పరిగి:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమ త్తంగా ఉండాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎ.అశోక్, కమిషనర్ వెంకటయ్యలు అన్నారు. పరిగి మునిసిపల్ పరిధిలోని నాల్గవ వా ర్డులో దోమల నివారణకు మందు పిచికారిని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో మలేరియా అధికారి వెంకన్న, కౌన్సి లర్ వారాల రవీంద్ర పాల్గొన్నారు.

● **పరిగి:** పరిగి మండలం మిట్టకోడూరు లోని ప్రభుత్వ సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పరిగి తహసీల్దా ర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి ఫీర్‌అహ్మద్ మాట్లాడుతూ మిట్టకోడూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూములను గుర్తించి ఒక్కక్కరికి మూడెకరాల చొప్పున పంపిణీ చేయాలని కోరారు. గ్రామంలోని నిరుపేదలైన ఎస్సీ, బీసీ, మైనార్టీలకు సెంటు భూమిలేని వారు ఉన్నారని, వారికి గుర్తించి కేటాయించా లని కోరారు. త్వరలో సీపీఐ ఆధ్వర్యంలో జెండాలను పాతుతామని తెలిపారు. వినతిప త్రం ఇచ్చినవారిలో సీపీఐ నాయకులు యాదయ్య, రాంచంద్రయ్య, వెంకటయ్య, బందెయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్-మల్కాజ్‌గిరి విశ్వకర్మ పరిషత్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మేడ్చల్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో సంఘం పెద్దల సమక్షంలో అధ్యక్షునిగా అల్వార రఘురామ చారిని నియమయించారు. ఉపాధ్యక్షుడిగా శాంబ్ రావు చారి, ప్రధాన కార్యదర్శిగా వడ్ల అశోక్ చారి, సంయుక్త కార్యదర్శిగా మొనంగిరి శ్రీకాంత్ చారి, కోశాధికారిగా మొనంగిరి బాల రాజు చారిని నియమించారు.

● **శామీర్‌పేట:** మండల కేంద్రం శామీ ర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేప ట్టారు. ఈ అన్నదానంలో ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్ర తినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నేడు(బుధవారం) నిర్వ హించనున్నట్లు బషీరాబాద్ ఎంపీడీవో రాఘ వులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతార న్నారు. డివిజన్, మండల స్థాయి వివిధ శాఖ ల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

● **కీసర రూరల్:** స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం కీసర అనుబంధ గ్రామం కీసరదాయర గ్రామస్థులు కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అల్లాదుర్గం కృష్ణ, నాయకులు జూపల్లి రవీందర్, విజయ్‌రెడ్డి, సత్తిరెడ్డి, అల్లాదుర్గం ఆంజనేయులు, కిష్టారెడ్డి, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ మృతి



ఓఆర్ఆర్‌పై ధ్వంసమైన డీసీఎం వ్యాన్, కంటేనర్

మేడ్చల్ టౌన్, జూన్ 25: ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు నుంచి మేడ్చల్ వైపు వస్తున్న డీసీఎంవ్యాన్ మంగళవారం తెల్లవారు జామున సుతారిగూడ సమీపంలోని ఓఆర్ఆర్‌పై ఆగిఉన్న కంటేనర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో డీసీఎం డ్రైవర్ రవికుమార్ వ్యాన్ దిగి ప్రమాదాన్ని పరిశీ లిస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో కంటేనర్ డీసీఎంను ఢీకొంది. ఈక్రమంలో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీమార్చురీకి తరలించారు. కాగా మృతుడు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సుతారిగూడ నివా సిగా పోలీసులు గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు శంకర్ గౌడ్

మూడుచింతలపల్లి, జూన్ 25: ఓ వ్యక్తి ఇంట్లో భార్యతో గొడవపడి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరి ధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోతాయిపల్లి నివాసి శంకర్‌గౌడ్(38) రెండు రోజులుగా మద్యం మత్తులో ఇంట్లో తన భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తాగిన మత్తులో తిరిగి భార్యతో గొడవపడి ఇంటి గదిలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో స్థానికులు పోలీసు లకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరు కున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవాబుపేటలో మహిళ..



శమంత (ఫైల్)

నవాబుపేట, జూన్ 25: మండలంలోని అక్నాపూర్‌లో ఓ మహిళ సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్నాపూర్ గ్రామానికి చెందిన చిలాపూరం శమంత(45) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈక్ర మంలో సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో తాడుతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. మృతురాలి కూతురు ఈ విషయాన్ని గమనించి చుట్టుపక్కల వారికి తెలపడంతో వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందింది. ఈ సంఘటనపై మృతురాలి కుటుంబస భ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్ భూషణ్ తెలిపారు. మృతురాలికి ఓకూతురు, కుమారుడు ఉండగా గతంలో భర్త గోపాల్ కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతు రాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అదుపుతప్పిన సిలిండర్ల డీసీఎం, పెట్రోల్ ట్యాంకర్



ఔటర్‌పై బోల్తాపడిన డీసీఎం

కీసర రూరల్, జూన్ 25: కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఓ ప్రమాదంలో సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం, మరో ప్రమాదంలో పెట్రోల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాపడ్డాయి. వివ రాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ నుంచి ఐడీఏ బొల్లారానికి గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదానికి గురైంది. అవుటర్ రింగ్ రోడ్డు పైన బోల్తాపడింది. దీంతో డీసీఎంలోని సిలిండర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. డీసీఎం డ్రైవర్ శ్రీని వాస్, మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో డీసీఎం వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిం దని పోలీసులు తెలిపారు. మరో ప్రమాదంలో కీసర నుంచి శామీర్‌పేట వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ కీసర మండలం తిమ్మాయిపల్లి వద్ద అదుపు తప్పింది. డ్రైవర్ అజాగ్రత్తతో ట్యాంకర్ రోడ్డుపై నుంచి పక్కనున్న చెట్లల్లోకి దూసుకెళ్లింది. ట్యాంకర్ డీజిల్, పెట్రోల్‌తో నిండుగా ఉండటంతో అప్రమత్తమైన పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. వెంటనే క్రేన్లను ఘటనాస్థలానికి రప్పించి, అదుపుతప్పిన ట్యాకంర్‌ను తొలగించారు. డ్రైవర్ నర్సింహకు స్వల్పగా యాలు కావటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిం చారు. ఈ మేరకు పోలీ సులు దర్యాప్తు చేస్తున్నారు.



అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్లల్లోకి దూసుకెళ్లిన పెట్రోల్ ట్యాంకర్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న డోజర్

● నేషనల్ హైవే సూపర్‌వైజర్, డ్రైవర్‌పై కేసు నమోదు



విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ప్రమాదానికి కారణమైన డోజర్

తాండూరు రూరల్, జూన్ 25: నేషనల్ హైవే రోడ్డు పనుల్లో విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. ప్రమాదవ శాత్తు వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కరన్ కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని రాంపూర్ సమీపం లోని అల్మాస్ ఇంటర్ నేషనల్ స్కూల్ వద్ద నేషనల్ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంను మట్టి చదును చేస్తున్న డోజర్ ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం నేలకొరిందింది. ఈ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ ఏఈ వెంకట్ నాయకుడు ఫిర్యాదు మేరకు హైవే సూపర్‌వైజర్, డ్రైవర్ బిహార్‌కు చెందిన ముజస్సాం అలాం పై కేసు నమోదు చేసి, డోజర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరించినట్లు తెలిపారు.

హస్నాబాద్‌లో దొంగల బీభత్సం



చెల్లాచెదురుగా పడిఉన్న బీరువాలోని వస్తువులు

కొడంగల్ రూరల్, జూన్ 25: మండలం లోని హస్నాబాద్‌లో దొంగలు బీభత్సవం సృష్టించారు. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలె పల్లి వెంకటయ్య, వెంకటమ్మ దంపతులు పొలంలో సాగుచేసిన పంటను విక్రయించ గా వచ్చిన రూ.2లక్షలు, 17తులాల వెండి కడియాలను బీరువాలో దాచిపెట్టింది. పొ లం పనులు ముగించుకొని సోమవారం సా యంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి త లుపులు తెరుచుకొని ఉన్నాయి.గుర్తు తెలి యని దుండగులు ఇంటి ముందు ఉన్న ఇ నుప రాడుతో తాళాలు పగలగొట్టి బీరువా లో ఉన్న రూ.2లక్షలు, 17 తులాల వెండి పట్టీలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితులు మంగళవారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలి

కులకచర్ల, జూన్ 25: అమ్మ ఆదర్శ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ డీవో రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, ఎంపీవో కరీం పాల్గొన్నారు.